

# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

# ముందు మాట

**ఈ** పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే  చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

భవబంధాలు

**ప్రతిభ, వెంట్రప్రగడ:**

**నా వయస్సు 40 సంవత్సరాలు. నాకు ఒకర్తే కూతురు. నా భర్తా నేనూ విడిగా ఉంటున్నాం. నా కూతురూ నేనే ఉండటం వల్ల తన మీద విపరీతమైన ప్రేమ పెంచుకున్నాను. ఇప్పుడు తన వయసు 18 ఏళ్ళు. మొన్నీ మధ్య వరకూ జరిగిన ప్రతి విషయం నాతో చెప్పి, నా మీద ప్రతి విషయానికీ ఆధారపడే నా కూతురు ఇప్పుడు స్వతంత్రంగా ప్రవర్తిస్తూంటే భరించలేకపోతున్నాను. ఈ ప్రవృత్తి నుండి బయటపడేదెలా?**

కొందరు పెద్దలు ప్రతీ విషయానికీ పిల్లలు తమ మీద ఆధారపడేలా చేసుకుని, దానికి 'ప్రేమ' అని పేరు పెట్టుకుంటారు. మీ కూతురు ప్రస్తుతం తన పనులు తాను చేసుకుంటోంది. అంతే కదా. అలా కాకుండా ప్రతీ విషయానికీ మీ మీదే ఆధారపడి ఉంటే, ఇదే శీర్షికకి మీరు "పద్దెనిమిదేళ్ళ నా కూతురు ప్రతీ చిన్న విషయానికీ నా మీదే ఆధార పడుతుంది. ఏం చేయాలి?" అని వ్రాసి ఉండేవారు.

మరో కోణంలోంచి ఆలోచిస్తే, సింగిల్ పేరెంట్స్ చాలా మందికి వచ్చే సమస్యే ఇది. తమ పిల్లలు ఎమోషనల్‌గా, సైకలాజికల్‌గా తమ మీదే ఆధారపడాలని కోరుకుంటారు. అదే విధంగా యుక్తవయసు (ఐ యామ్ ఓకే స్టేజ్) లోకి వచ్చిన పిల్లలు తల్లిదండ్రుల పరిధి నుండి దూరంగా వెళ్ళటం కూడా సర్వసాధారణమైన విషయమే. మారాల్సింది మీరే. ఎందుకంటే ఈరోజు కాకపోయినా రేపయినా మీ అమ్మాయి మిమ్మల్ని విడిచి వెళ్ళిపోవలసిన పాపే కదా. మొదట్లో కొంత వాక్యూమ్ (శూన్యత) ఉంటుంది. మీరు ఇప్పటి నుంచీ మరొక మంచి అభిరుచిని పెంచుకోండి. బంధంలో ఇరుక్కోకుండా మనిషిని 'మంచి అభిరుచి' కాపాడుతుంది.



**రాజ్యలక్ష్మి, సికింద్రాబాద్:**

**నేను ఓ గవర్నమెంట్ స్కూల్లో టీచర్గా పనిచేసి రిటైరయ్యాను. మావారు రెండేళ్ల క్రితమే పోయారు. ఒక్కడే కొడుకు. వాడు, వాడి భార్య ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్న పిల్లాడిని నేనే చూసుకోవాలి. అది నాకు ఆనందమే. కానీ నా కోడలు ఇంట్లో ఏ ఒక్క పనీ చేయదు. పిల్లాడిని రోజంతా నేను చూస్తున్నాను కదా. కనీసం తను వచ్చాకయినా వాడి బాధ్యత తీసుకోవచ్చు కదా! అలా చేయదు. పైగా పొద్దున్న నేనే వంట చేసి ఇద్దరికీ బాక్సులు పెట్టాలి. సాయంత్రం వచ్చేసరికి వంట చేసివుండాలి. వాళ్ల మీద ఎంత ప్రేమ ఉన్నా ఇదంతా కష్టంగా అనిపిస్తోంది. ఈ వయసులో ఇంత శ్రమ భరించలేక పోతున్నాను. నా కొడుకుతో చెబుదామంటే చాడీలు చెపుతున్నాను అనుకుంటాడే మోనని భయం. ఎవరూ బాధపడకుండా ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి? –**

'పంకా వేగంగా కదులుతోందని' ఒకరు, 'కాదు... గాలి వేగంగా కదులుతోందని' మరొకరూ వాదించుకొంటూ, ఎటూ తేలక ఒక బౌద్ధభిక్షువుని అడిగారట. "తేలని విషయం గురించి వాదించుకొంటున్న మీ ఇద్దరి బుద్ధీ తిరుగుతోంది" అన్నాడట ఆ భిక్షు.

మిమ్మల్ని తక్కువ చెయ్యటం కోసం కాదు ఈ ఉదాహరణ చెప్పింది. ఇదే సమస్య మీ కోడలు ముందు ఉంచితే ఆమె ఏమని వాదిస్తుందో మీకు తెలుసా? "...ఆఫీసులో రెక్కలు ముక్కలు చేసుకుని వస్తాము. ఆవిడ గారు ఇంట్లోనే ఉంటుంది కదా. పొద్దున్నే కాస్త బాక్సులు సర్దిచ్చి, సాయంత్రం వచ్చేసరికి వంట చేసి ఉంచుతే అలసిపోతుందా? ఎప్పుడూ పిల్లాడితో ఆడుకోవడం తప్ప ఏ పనీ చేయదు" అంటుంది. ఉమ్మడి కుటుంబాల్లో ఒకరి బాధ్యతని మరొకరు వెసులుబాటుగ చూస్తారు. ఒకరి ఆనందాన్ని మరొకరు 'కోల్పోతున్న హక్కు' గా భావిస్తారు.

మీరు మీ సమస్య గురించి మీ అబ్బాయితో చెపితే, మీరు భావించినట్టు 'చాడీలు చెప్తున్నారని' అతను అనుకోకపోవచ్చు. మీ బాధ అర్థం చేసుకోవచ్చు. మీరెలా ఫీల్ అవుతున్నారో తన భార్యతో చెప్పొచ్చు. కానీ దానికి ఆమె రియాక్షన్ మాత్రం తప్పకుండా నెగిటివ్ గానే ఉంటుంది. ఒకవేళ మీరు ఆమెతోనే డైరెక్ట్ గా మాట్లాడినా, ఫలితం పైన చెప్పిన విధంగానే ఉండొచ్చు.

మీరు రెండు విషయాలు ముందు తేల్చుకోండి. మీకు వస్తున్న పెన్షన్ ఏం చెస్తున్నారు. మీ మనవడిని వదిలి మీరు కొంత కాలం ఉండగలరా? ఏ తీర్థయాత్రల నెపంతోనో లేదా బంధువుల దగ్గరకి వెళ్తున్నాననో, కొన్ని రోజులు వాళ్లకి దూరంగా ఉండండి. ఆ ఇంటి పట్ల వ్యామోహం కాస్త తగ్గించుకోండి. బాధపడుతూ ఒక ఇంట్లో ఉండటం కన్నా, దూరంగా ఉండటం మేలు కదా. అలా అని మిమ్మల్ని మీ వాళ్ళకి శాశ్వతంగా దూరంగా ఉండమనటం లేధు. వాళ్లకి బాధ్యత తెలిసొచ్చేలా చేయ మంటున్నాను. ఇంకొన్నాళ్లు పోతే మీ మనువడు కూడా స్కూల్ కి వెళ్లడం మొదలు పెడతాడు. అప్పుడు మీకు మరింత తీరిక దొరకవచ్చు.

ముందు మీరు మీ సమస్యని విశ్లేషించుకోండి. మీ సమస్య ఓపిక లేకపోవటమా? లేక ఇంట్లో చాకిరి అంతా నేనే చేస్తున్నానన్న ఫీలింగా?

### వి. శ్రీరామచంద్రమూర్తి, ఏలూరు:

**నేనో రిటైర్డ్ ప్రభుత్వోద్యోగిని. ఒక్కడే కొడుకు. ఎంతో ప్రేమగా పెంచుకున్నాం. కానీ వాడు మాత్రం మామీద ప్రేమే లేకుండా ఉన్నాడు. ఎంత వద్దని చెప్పినా వినకుండా ఓ గొప్పింటి అమ్మాయిని ప్రేమించి పెళ్లాడి ఇల్లరికం వెళ్లిపోయాడు. ఎప్పుడో ఒకసారి వచ్చి చూసి పోయేవాడు. తర్వాత దంపతులిద్దరూ ఫారిన్ వెళ్లిపోయారు. మొదట్లో ఫోన్ చేసేవాడు. ఆ తర్వాత అది కూడా మానేశాడు. మేం చేసినా పొడిపొడిగా మాట్లాడి పెట్టేస్తాడు. ఒక్కసారి వచ్చి కనిపించమంటే వినిపించుకోడు. దాదాపు పదేళ్లుగా ఇదే వరుస. నేనేదో సర్ది చెప్పుకుంటున్నాను. కానీ నా భార్య బెంగ పెట్టేసుకుంది. కొడుకుని చూసుకోకుండానే కన్నుమూస్తానేమో అని కుమిలిపోతోంది. వాడిని రప్పించలేను. ఆమె బాధని చూడలేను. ఏం చేయాలో అర్థం కావడం లేదు.**

బంధాన్ని 'సరైన స్థాయి'లో పెంచుకొని, అవసరమైనప్పుడు తెంచుకోగలిగే వారిని విషాదాలు దరిచేరవు. బంధం వల్ల విషాదం వస్తుందని తెలుసుకోవటమే జ్ఞానం. చాలా విషాదాలని మనం కొని తెచ్చుకుంటాం. పెంపుడు కుక్క చనిపోతే భోజనం మానెయ్యటం, భర్త తనతో కాకుండా అతడి తల్లితో ఎక్కువ చనువుగా ఉంటాడని ఈర్ష్య చెందటం, కొడుకు విదేశం నుండి పుట్టినరోజు నాడు శుభాకాంక్షలు పంపలేదని బాధపడటం కూడా బంధాలకి ఉదాహరణే.

ప్రేమ వేరు. బంధం వేరు. బాధకి మూలకారణం 'ప్రేమ' కాదు. 'బంధం'. ఎక్కడైతే బంధంలేని ప్రేమ ఉంటుందో, అక్కడ బాధ లేదు. మీ ప్రశ్నకి సంబంధం లేకపోయినా, మరొక విషయం. విదేశాల్లో సెటిలయిన సంతానం గురించి దుఃఖించే వారు ఒక విషయం పాజిటివ్‌గా ఆలోచించాలి. 'పోటీ ప్రపంచంలో ఇది తప్పదు' అన్న ఆలోచనతో పిల్లల్ని రాత్రింబవళ్ళు ప్రోత్సహించి చదివించింది మీరే కదా! 'డబ్బు సంపాదించే యంత్రంగా' తయారు చేద్దామని, నిద్రాహారాలు మానిపించి, ఆరో క్లాసులోనే ఐ.ఐ.టి. కోచింగ్ కోసం కార్పొరేట్ కాలేజీలో చేర్చి, వారి బాల్యాన్ని నాశనం చేసి, సరస్వతీదేవి కాళ్ళకు పారాణిగా పూసారు. వారు వెళ్తూంటే, 'మా సంతానం అమెరికా' అని గర్వంగా చెప్పుకున్నారు. వారు మళ్ళీ తిరిగి రారు. మీ వృద్ధాప్యంలో ఇటు చూడరు. కావాలంటే డబ్బులు పంపిస్తారు. జీవితంలో పైకి రావటమంటే అమెరికా వెళ్ళి డబ్బు సంపాదించటం అన్న థియరీని బలంగా నమ్మి వుంటే, ఇంక దుఃఖం దేనికి? వారి జీవితాన్ని ఆర్థికంగా బాగుపరచానన్న సంతోషంతో ఉండండి.

"మనసుండే వారికే తెలుస్తుందా బాధ. మెట్ట వేదాంతులకీ, మెటీరియలిస్టులకీ ఇలాంటి సెంటిమెంట్సు, బాధలూ ఉండవు" అంటారా? అయితే కోరికను త్యజించమన్న బుద్ధుడి కన్నా గొప్ప వేదాంతి, ఫలితం ఆశించకుండా పని చెయ్యమని చెప్పిన కృష్ణుడి కన్నా పెద్ద మెటీరియలిస్టులు మరొకరు లేరు.

పై వివరణ చదివి, "అసలు బంధాలే ఉండకూడదు" అని ఈ రచయిత చెప్తున్నాడా అన్న అనుమానం పెంచుకోవద్దు. దుఃఖ కారణమైన బంధాలు ఉండకూడదని చెప్పటమే ఇక్కడ ఉద్దేశ్యం.

**రామలింగయ్య, రాజమండ్రి:**

**రక్త సంబంధీకులు, దగ్గరవాళ్ళు, నా అనుకున్న వాళ్ళు.... వీరితోనే సమస్యలు. నా ప్రేమని వారు అర్థం చేసుకోవటం లేదు. చచ్చిపోవాలని ఉంది.**

బుద్ధుడి కథ మరొకటి చెపుతాను. ఒక ఇల్లు తగలబడి పోతోంది. జనం చుట్టూ చేరి చూస్తున్నారు. యజమాని దూరంగా నిల్చుని రోదిస్తున్నాడు. ఎంతో అందమైన ఇల్లు. రెట్టింపు ధర ఇస్తామన్నా అమ్మలేదు. అందుకే దుఃఖం. ఇంతలో పెద్ద కొడుకు వచ్చాడు. "నీకు తెలీదా నాన్నా? మూడు రెట్లు ధర వస్తే, ఇల్లు నిన్నే అమ్మేసాను. నీకు చెప్పేటంత సమయం లేక పోయింది" అన్నాడు. చేత్తో తీసేసినట్టు ఒక్క సారిగా వేదన పోయింది. గుండెల్నిండా సంతోషంగా గాలి పీల్చుకున్నాడు. ఆ తరువాత తనూ ఒకడిగా మంటల్ని చూస్తూ పక్క వారి సంభాషణలో పాలుపంచుకొనసాగాడు...!



అదే ఇల్లు. అవే మంటలు. క్షణం క్రితం వరకూ ఉన్న అటాచ్‌మెంట్ పోయింది. ఇప్పుడు నిర్వికారంగా... నిజం చెప్పాలంటే... కాస్త ఆనందిస్తున్నాడు కూడా. ఇంతలో రెండో కొడుకు వచ్చాడు. "నువ్వు సంతకం పెట్టకుండా అమ్మకం ఎలా పూర్తి అవుతుంది నాన్నా. ఆమాత్రం తెలీదా?" అన్నాడు. అంతే. తిరిగి దుఃఖం చుట్టు ముట్టింది. ఈ లోపులో మూడో కొడుకు వచ్చి, "మాట మీద నిలబడే నిజాయితీ గల మనిషి ఆయన. మాటతోనే అమ్మకం జరిగిపోయిందన్నాడు. సగం డబ్బు చెల్లించేశాడు కూడా" అన్నాడు. తిరిగి సంతోషం పెనవేసుకుంది.

'ఇది నాది' అనుకున్నప్పుడు దుఃఖం వస్తోంది. కాదనుకున్నప్పుడు పోతోంది. నిజానికి ఏమీ మారలేదు. ఇదే బుద్ధుడు చెప్పిన నిర్వికార నిర్వాణ యోగం. ఇతరుల ప్రేమ/గుర్తింపు కోసం మంచిగా బ్రతక్కండి. మీకోసం బ్రతకండి. అప్పుడు దుఃఖం మిమ్మల్ని వదిలేస్తున్నందుకు దుఃఖిస్తుంది.

**లక్ష్మి, నాయుడుపేట:**

**నా వయసు 55. నాకు నలుగురు పిల్లలు. పెళ్లిళ్లయ్యి వేర్వేరు ఊళ్లలో స్థిరపడిపోయారు. నేను, నా భర్త ఉంటున్నాం. నాకు పిల్లలంటే చాలా పిచ్చి ప్రేమ. ఎప్పటికప్పుడు ఫోన్ చేసి వాళ్ళ ఆరోగ్యం ఎలా ఉన్నదో, ఎలా ఉన్నారో కనుక్కుంటూ ఉంటాను. వాళ్లూ బాగానే మాట్లాడతారు కానీ, ఒక్కోసారి విసుక్కుంటూంటారు. 'ఎందుకు కంగారు పడతారు, మేమే ఫోన్ చేస్తాం కదా' అంటారు. నా మనసు చివుక్కుమంటుంది. అయినా వాళ్ల గురించి తపన పడకుండా ఉండలేను. రోజుకొకసారి మాట్లాడకపోతే మనసు నిలవదు. మావారు కూడా నాదే తప్పన్నట్టు మాట్లాడతారు. ఎందుకు అస్తమానం ఫోన్లని విసుక్కుంటారు. పిల్లల మీద ప్రేమ చూపించడం కూడా తప్పేనా? మీరే చెప్పండి.**

జీవితంలో గొప్పగొప్ప విషాదాలకి కారణమైనవి ఆర్థిక సమస్యలూ, కుటుంబ సమస్యలు అనుకుంటాం. కాదు. అన్ని సమస్యల కన్నా తీవ్రమైన అసంతృప్తి ప్రేమించటానికి ఎవరూ లేకపోవటం..! అయితే దానికన్నా దారుణమైనది ప్రేమ 'హద్దులు దాటటం'. అందుకే మిగతా అన్ని సమస్యల వల్ల ఆత్మహత్యలు చేసుకున్నవారి కన్నా, ప్రేమ కారణంగా చనిపోయినవారే ఎక్కువ.

ఏది ఎంతవరకూ కావాలో... ఏది ఎప్పుడు వదులుకోవాలో తెలుసుకో(లే)క పోవటమే మోహం. మోహం అంటే అనారోగ్యకరమైన అటాచ్‌మెంట్. బంధంవల్ల విషాదం వస్తుందని తెలుసుకోవటమే జ్ఞానం. బంధాన్ని సరి అయిన స్థాయిలో పెంచుకొని అవసరమైనప్పుడు తెంచుకోగలిగేవారిని విషాదాలు దరిచేరవు. ప్రేమ హద్దులు దాటితే మోహం అవుతుంది. మోహం ముదిరితే వ్యామోహం అవుతుంది.



.

ఒక రైతు గుర్రం అడవిలోకి పారిపోయింది. అందరూ సానుభూతి తెలిపారు. 'ప్రాప్తం కదా' నిర్లిప్తంగా అన్నాడు రైతు. మూడు రోజులుపోయాక అది తిరిగివస్తూ అడవిలోంచి మూడు గుర్రాల్ని తోడుగా తెచ్చింది. అందరూ అభినందించారు. 'ప్రాప్తం కదా' అన్నాడు రైతు. ట్రైనింగ్ అవని గుర్రాన్ని స్వారీ చెయ్యబోయి కొడుకు కాలు విరగ్గొట్టుకున్నాడు. 'ప్రాణం పోలేదు కదా' అన్నాడు రైతు. మరుసటి రోజు సైన్యంలోకి యువకుల్ని బలవంతంగా పట్టుకెళ్ళిన అధికారులు అందర్నీ తీసుకెళ్ళి, కాలు విరిగిన కొడుకుని వదిలేసారు. 'ప్రాప్తం కదా' అన్నాడు రైతు. చిన్న జెన్ కథలో గొప్ప నీతి.

**లక్ష్మినర్సింహాలయ స్వామి, కోడూరు.**

**ఇన్ని విషాదలకి మూలమని తెలిసి కూడా మనిషి భవబంధాలలో ఎందుకు ఇరుక్కుంటాడు?**

ఇవి తెలుసుకోవాలంటే మనం జీవితపు నాలుగు స్టేజెస్ గురించి తెలుసుకోవాలి.

**నేను బాగాలేను, ప్రపంచం బాగాలేదు:** ఇది చిన్నపిల్లల్లో ఎక్కువ ఉంటుంది. ప్రతీ చిన్న విషయానికి, చివరికీ కూర నచ్చకపోతే అలగటం, పెన్సిల్ ముల్లు విరిగిపోతే ఏడవటం... ఇలాంటి మనస్తత్వం ఈ స్టేజిలోకి వస్తుంది.

**నేను బాగాలేను, మీరు బాగున్నారు:** 'నేను నిద్ర పోతున్నప్పుడు అన్నయ్యకి చాక్లెట్లు ఇచ్చి అమ్మానాన్న సినిమాకి వెళ్ళి సంతోషంగా ఉన్నారు. చాక్లెట్ల వల్ల అన్నయ్య సంతోషంగా ఉన్నాడు. నేను మాత్రం సంతోషంగా లేను. తమ్ముడికి అన్నీ కొనిపెడుతున్నారు నాకేమీ కొనివ్వటంలేదు'. ఇదే రెండో స్టేజి. ఇదే స్టేజ్ ఫియర్‌కి కారణం. దీని గురించి తరువాత మాట్లాడుకుందాం.




**నేను బాగున్నాను, మీరు బాగాలేదు**: ఇది చాలా డేంజరస్ స్టేజ్. ఈ స్టేజ్‌లోనే పిల్లలు తమకో సెపరేట్ రూమ్ కావాలి అనుకుంటారు. సెల్‌ఫోన్, కంప్యూటర్, ఛాటింగ్ ఇవన్నీ వాళ్ళకి మంచి మిత్రులౌతాయి. '... మా నాన్నకి ఏం తెలుసు? మైఖేల్ జాక్సన్ తెలుసా! తెలివైన వాళ్ళంటే మా ఫ్రెండ్స్".

ఈ స్టేజ్‌లో పిల్లలు తల్లిదండ్రుల కళ్ళలోకి చూసి మాట్లాడటం మానేస్తారు. ఏదైనా విషయం చెప్పాల్సివచ్చినప్పుడు అమ్మతో చెప్పి నాన్నతో చెప్పు అంటారు. ఏం కావాల్సివచ్చినా సరే గడసరిగా అడుగుతారు. ప్రేమతో అడగటం మానేస్తారు. వాళ్ళ రూమ్‌లోకి గాని మనం వెళ్తే పెద్ద అగ్నిపర్వతం పేలినట్టు ఫీలౌతారు. వాళ్ళ పుస్తకాలు ముట్టుకోనివ్వరు. సెల్‌ఫోన్స్‌లో మెసేజీలు చూడనివ్వరు. అసలు ఎవరితో అన్ని గంటలు మాట్లాడుతున్నావు నీకు అర్థంకాదు.

**నేను బాగున్నాను, మీరు బాగున్నారు**: మనిషి ఎదిగే కొద్దీ, మెచ్యూరిటీ వచ్చే కొద్దీ వచ్చే స్టేజి 'నేను బాగున్నాను, అందరూ బాగుండాలి'. ఈ స్టేజిలో మనిషి తండ్రిపట్ల ఎక్కువ ఆప్యాయత చూపిస్తాడు. తల్లితో, అక్కా, చెల్లితో ప్రేమగా ఉంటాడు. కానీ అప్పటికే నలభై

ఏళ్ళో, యాభై ఏళ్ళో వచ్చేసాయి. ఏ మనిషైతే ఈ స్టేజిలోకి వేగంగా వచ్చేస్తాడో సంపూర్ణమైన జీవితాన్ని గడుపుతాడు. కొందరికి వందేళ్ళు వచ్చిన ఆ స్థాయి రాదు.

ఈ నాలుగు స్థాయిల గురించి మరింత వివరంగా తెలుసుకోవాలంటే పై పుస్తకం చదవండి. చివరి స్థాయి గురించి అద్భుతమయిన పుస్తకం భగవద్గీత.

**(కొనసాగింపు వచ్చేనెల)**